# రోడ్లపైనే రైతుల ఆరుగాలం శ్రమ

- పేరుకే కొనుగోలు కేంద్రాలు
- ధాన్యం ఎప్పుడు కొంటరు?
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

బోయినపల్లి: వరదవెల్లిలో బోటును ప్రారంభిస్తున్న బండి సంజయ్

బోయినపల్లి, నవంబర్ 4: రైతుల ఆరుగాలం శ్రమంతా రోడ్లపైనే ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిందని, ధాన్యం ఎప్పుడు కొంటుందని ప్రశ్నించారు. బోయినపల్లి మండలం వరదవెల్లి దత్తాత్రేయ ఆలయానికి వెళ్లేందుకు ఎంపీ నిధులు రూ.9 లక్షలతో కొనుగోలు చేసిన బోటును సోమవారం ఆయన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి ప్రారంభించారు. అనంతరం బోటులో వెళ్లి దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయం చుట్టూ నీళ్లు ఉండడంతో గుట్టపైకి భక్తులు వెళ్లడానికి పడుతున్న ఇబ్బందులు చూసి బోటు మంజూరు చేయించినట్లు తెలిపారు. బోటు నిర్వహణ కోసం మాత్రం నామినల్‌గా డబ్బులు తీసుకుంటారని చెప్పారు.

**కాలయాపన కోసమే సర్వే**

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం చేపడుతున్న సర్వే ఎందుకోసమని, ప్రజల కులం, మతం మారుతుందా? అని, కేవలం కాలయాపన కోసమేనని బండి సంజయ్ మండిపడ్డారు. రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, వారికి బోనస్ చెల్లించడం లేదని, పూర్తి స్థాయిలో రుణ మాఫీ కాలేదని, పంట సాయం అందలేదని తెలిపారు. ముందుగా వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఈఈ భూమేశ్వర్, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో జయశీల, మాజీ ఎమ్మెల్యే సుద్దాల దేవయ్య, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## డిమాండ్లు పరిష్కరిస్తేనే ధాన్యం దిగుమతి చేసుకుంటాం

**రైసుమిల్లర్ల స్పష్టీకరణ**

సమస్యలు వివరిస్తున్న రైసు మిల్లర్లు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): తమ డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించిన తర్వాతే ధాన్యం దిగుమతి చేసుకుంటామని రైసుమిల్లర్లు స్పష్టీకరించారు. సోమవారం సిరిసిల్ల కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఖిమానాయక్‌తో తమ సమస్యలు మొరపెట్టుకున్నారు. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదించినట్లు జేసీ తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన చేస్తున్నందున వెంటనే ధాన్యం దిగుమతి చేసుకోవాలని సూచించారు. ఒక్క రోజు గడువు ఇవ్వాలని మిల్లర్లు కోరినా అందుకు ఆయన అంగీకరించలేదు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని వాహనాల్లో మిల్లులకు పంపిస్తామని, అన్‌లోడింగ్ చేసుకోవాలని సూచించారు. సరేనంటూ బయటకు వచ్చిన మిల్లర్ల సంఘం అధ్యక్షుడు పబ్బ నాగరాజు, గరిపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ ధాన్యం దించుకున్న తర్వాత క్వింటాల్‌కు 67కిలోలు ఇవ్వాలని అధికారులు చెపుతున్నారని, వాస్తవానికి క్వింటాలు ధాన్యంకు 55కిలోలు మాత్రమే వస్తున్నందున 12కిలోలు తమకు నష్టం జరుగుతుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గట్కేసర్‌లో రాష్ట్ర రైసు మిల్లర్ల సంఘం సమావేశం ఉందని, సమావేశంలో చేసిన తీర్మానాల ప్రకారం.. తాము అనుసరిస్తామని జిల్లా మిల్లర్లు తెలిపారు. అప్పటి వరకు ధాన్యం దించుకోమని చెప్పారు. జిల్లాలో 90 వరకు రారైస్‌మిల్లులు, 35 వరకు బైల్డ్ రైసుమిల్లులున్నట్లు వారు తెలిపారు. అధికారులు ఒత్తిడీ తేవడం సరైంది కాదన్నారు. అదనపు కలెక్టర్‌ను కలిసి వారిలో రైసు మిల్లుల యజమానులు నగునూరి శ్రీకాంత్, చికోటి రవీందర్ తదితరులున్నారు.


సిరిసిల్ల రూరల్ : తంగళ్లపల్లి ఠాణాలో మాజీ సర్పంచ్‌లు

## మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల సాధనకు పోరుబాట

- తరలివెళ్తున్న మాజీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- హైదరాబాద్‌లో జిల్లా మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మధు అరెస్ట్

వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు

సిరిసిల్ల రూరల్, నవంబర్ 4 : తాజా మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల సాధన కోసం చలో హైదరాబాద్ పోరుబాటకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. మూడు నెలలుగా శాంతియుతంగా చేస్తున్న కార్యక్రమాలకు ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీంట్లో భాగంగా సోమవారం చలో హైదరాబాద్ పోరుబాటకు తరలివెళ్తున్న, మాజీ సర్పంచ్‌లను పోలీసులు అడ్డుకుని ఠాణాకు తరలించారు. హైదరబాద్‌కు తరలివెళ్లిన మాజీ సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జిల్లా సర్పంచ్‌ల పోరం అధ్యక్షుడు మాట్ల మధు పోరుబాటలో పాల్గొనగా, హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సర్పంచ్‌ల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్భందాలు, నిరసనలను అడ్డుకోవడం ప్రజాపాలన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిలో వలకొండ వేణుగోపాలరావు, గనప శివ జ్యోతి,నందగిరి నర్సయ్య, బాలసాని పర్శ రాములుగౌడ్, పోచయ్య, జక్కుల రవీందర్‌యాదవ్, ఉమరాజు, నాంపల్లి ఉన్నారు.

**బిల్లుల నిరసనపై అరెస్టులు**

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 4: తమకు రావాల్సిన బకాయిలపై మాజీ సర్పంచ్‌ల చలో హైదరాబాద్ కార్యక్రమం పిలుపు నేపథ్యంలో పోలీసులు పలువురు సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్టు చేశారు. సోమవారం ఉదయం అరెస్టు చేయగా ఇది అప్రజాస్వామిక చర్యగా మాజీ సర్పంచ్‌లు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్‌లు కొండాపురం బాల్‌రెడ్డి, భూక్యా శంకర్‌నాయక్, పడిగెల రవీందర్ ఉన్నారు.

వేములవాడ రూరల్, నవంబర్ 4: మండలంలోని మాజీ సర్పంచ్‌లు వెంకటరమణరావు, రాసూరి రాజేశం, పండుగ తిరుపతి, గుర్రం లక్ష్మారెడ్డి, రంగు రాములను అరెస్టు చేశారు. ప్రభుత్వం వెంటనే మాజీ సర్పంచ్‌ల బిల్లులను వెంటనే చెల్లించాలని, లేకుంటే మరిన్ని కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు.

చందుర్తి,నవంబర్ 4: జోగాపూర్ సర్పంచ్ మేకల పర్శరాములు, సనుగుల సర్పంచ్ లింగంపల్లి కరుణాకర్, రామ్‌రావు పల్లె సర్పంచి కమలాకర్‌రావు, లింగంపేట సర్పంచ్ తనయుడు డప్పుల అశోక్, చందుర్తి సర్పంచ్ భర్త సిరికొండ శ్రీనివాస్‌ను పోలీసులు హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సొంత పూచికత్తుపై మధ్యాహ్నం వదిలిపెట్టారు.

ఇల్లంతకుంట, నవంబర్ 4 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు తాజా మాజీ సర్పంచులకు బిల్లులు రాక పోవడంతో హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమాన్ని జరగకుండా ఎక్కడివారిని అక్కడే నిర్బందించారు. మాజీ సర్పంచులు ఉన్నారు.

గంభీరావుపేట, నవంబర్ 4: గ్రామాల్లో అభివృద్ధి చేసిన పెండింగ్ బిల్లులను తమకు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాదు వెళ్లనున్న మాజీ సర్పంచులను ఎస్ఐ శివకుమార్ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. మాజీ సర్పంచ్‌లు ఏనుగు కేశవరావు, ఎడబోయిన రాజు, అల్లె సత్యం, అజ్మీరా బాల్యానాయక్ తదితరులు ఉన్నారు.

# నేషనల్ హైవే అలైన్‌మెంట్ మార్చండి

- కేంద్రమంత్రి బండి సంజయ్, విప్ ఆది శ్రీనివాస్‌కు బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల వినతి
- సమస్యను విని సానుకూల స్పందన
- అధికారులతో చర్చిస్తామన్న బండి, ఆది

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసి వినతిపత్రం అందజేస్తున్న సిరిసిల్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, నిర్వాసితులు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల పట్టణంలో నుంచి వెళ్తున్న నేషనల్ హైవే 365బీ అలైన్‌మెంట్ మార్చాలని బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు విన్నవించారు. జిల్లా కేంద్రం లోపలి నుంచి జాతీయ రహదారి నిర్మాణం వల్ల అనేక భూములతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, నర్సింగ్ కళాశాలు, రిజిస్ట్రేషన్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలకు ఇబ్బంది కలుగుతున్నదని ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు బొల్లి రాంమోహన్, కాంగ్రెస్ నాయకులు గడ్డం నర్సయ్య ఆధ్వర్యంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులంతా కలిసి సోమవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్, వేములవాడలో విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అలైన్‌మెంట్ మార్చేలా మున్సిపాల్టీలో తీర్మానం చేయాలని చైర్పర్సన్ జిందం కళకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వాసితుల పక్షాన జిందం చక్రపాణి, గడ్డం నర్సయ్య మాట్లాడుతూ సిరిసిల్ల నుంచి సిద్దిపేట జిల్లా దుద్దెడ దాకా నిర్మిస్తున్న నేషనల్ హైవే పట్టణం నడి బొడ్డున ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ఆనుకుని వెళ్తున్నందున పట్టణ వాసులకు తీవ్ర ఇబ్బంది అవుతుందన్నారు. భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని, రహదారి బీజీగా మారిపోతుందన్నారు. నేషనల్ హైవేలు మున్సిపాల్టీ శివారులో నిర్మిస్తారన్న విషయాన్ని మంత్రి, విప్‌ల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రగుడు నుంచి కలెక్టరేట్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెనుకాల నుంచి తాడూరు మీదుగా మానేరు నదిపై బ్రిడ్జి నిర్మించే ప్రతిపాదన వల్ల అనేక మంది భూములు కోల్పోతున్నారన్నారు. నాలుగు వరుసల బైపాస్ రహదారి నిర్మాణంలోనే ఇప్పటికే అనేక మంది భూములు కోల్పోయారని, కొత్తగా నేషనల్ హైవేతో గతంలో భూములు కోల్పోయిన వాళ్లే తిరిగి కోల్పోవాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. బైపాస్ రోడ్డులో భూములు కోల్పోయి దెబ్బతిన్న వారిపైన దెబ్బమీద దెబ్బ పడి పూర్తి స్థాయిలో నష్టపోతున్నందున జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చాలని కోరినట్లు తెలిపారు. రామప్ప గుట్టల సమీపంలోని మానేరు నదిపైన రాజమండ్రి తరహా రోడ్‌కం రైల్ బ్రిడ్జి నిర్మించాలన్న ప్రతిపాదన ఉన్నందున జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్పును పరిశీలించాలని కోరగా, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారని, అధికారులతో చర్చిస్తామని తమతో చెప్పారని వివరించారు. వారి వెంట నిర్వాసితులు ఎర్రం శంకర్, కత్తెర దేవదాస్, బొప్పదేవయ్య, దుమాల శ్రీకాంత్, సిరిగిరి రమేశ్, ఎర్రం వార్ సురేశ్, పాటి రాజ్‌కుమార్, బంటు బాలకిషన్ తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ**

సిరిసిల్ల రూరల్, నవంబర్ 4 : రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి కోరారు. ఈ మేరకు సిరిసిల్ల మున్సిపల్ 12 వవార్డులో సిరిసిల్ల సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆమె స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాతూరి రాజిరెడ్డి,మాజీ ఎంపీటీసీ ఓగ్గు రాజేశం, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, వీరగోని శ్రీనివాస్, నర్మేట ప్రభుదాస్,మాజీ సర్పంచ్ అనవేని బాలయ్యయాదవ్, రైతులు ఉన్నారు.

**తంగళ్లపల్లిలో..**

తంగళ్లపల్లి మండల కేంద్రంలో సిరిసిల్ల సింగిల్‌విండోఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సిరిసిల్ల సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ నేరేళ్ల నర్సింగంగౌడ్ ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెద్దూరి తిరుపతి, ఎఎంసీ డైరెక్టర్లు పొన్నాల పర్శరాములు, ఆరెపల్లి బాలు,గుగ్గిల్ల రాములు, మాజీసర్పంచ్ ఆసాని సత్యనారాయణరెడ్డి, ఎడమల బాల్‌రెడ్డి,రాపెల్లి ఆనందం, దొర్నాల మల్లారెడ్డి, నారాయణరెడ్డి, రైతులు ఉన్నారు.

## సర్దుబాటు మార్గదర్శకాలను విస్మరించొద్దు

తెలంగాణ చౌక్ : నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు

తెలంగాణ చౌక్, నవంబర్ 4: జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ సర్దుబాటు జీవో 25 మార్గదర్శకాలను విస్మరించొద్దని ఉపాధ్యాయ ఐక్యసంఘం కన్వీనర్ మోతిలాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి, ఎంఈవో రఘుపతికి వినతిపత్రాన్ని అందజేశారు. బాధ్యులు శ్రీనివాస్‌రావు, తిరుపతి, జక్కని నవీన్, అజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వీర్నపల్లి, నవంబర్ 4: మండలంలోని గర్జనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకుడు కులేరి ప్రేమ్‌సాగర్, ఉపాధ్యాయ సంఘ నాయకులు శ్రీనివాస్, గజన్, బలరాంనాయక్, మంజుల, శ్రీనివాస్, కవిత ఉన్నారు.

రుద్రంగి, నవంబర్ 4: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. అనంతరం మండల విద్యాధికారి ఎన్ రామకృష్ణకు ఉపాధ్యాయులు వినతి పత్రం అంజేశారు. కాంపెక్ట్ ప్రధానోపాధ్యాయులు సమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు సతీష్, సరిత, సునీత, జ్యోతి, ప్రసన్న, మధుర, మీనాక్షి, రమణరెడ్డి, మోహన్, బాలరాజు, వసంత్‌కుమార్, హనుమాండ్లు ఉన్నారు.

గంభీరావుపేట, నవంబర్ 4: మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం ఎదుట ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం మండల విద్యాధికారికి వారు వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయులు ఎర్ర సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, రాజేశ్, శీలకుమార్, రిజ్వాన బేగం, దేవేందర్‌ఉన్నారు.

ముస్తాబాద్ నవంబర్ 1 : జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు అ సంబద్ధంగా ఉందని ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు మండల విద్యాధికారికి వినతి పత్రంలో పేర్కొన్నారు. శివశంకర్, బాలకిషన్, ఎల్లారెడ్డి, శ్రీనివాస్ రావు, లక్ష్మిరెడ్డి, సురేశ్, సుధాకర్, విజయకుమార్, సత్యం ఉన్నారు.

చందుర్తి, నవంబర్ 4 : ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా, జీవో నంబర్ 25కు విరుద్ధంగా చేపట్టడంతో జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు ఎడ్ల కిషన్, వంగ తిరుపతి అన్నారు. ఉపాధ్యాయ ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎమ్మార్సీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈవో వినయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

వేములవాడ రూరల్, నవంబర్ 4: ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు చేశారని ఆరోపించారు. ఉపాధ్యాయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తూ ఎంఈవో బన్నాజీకి వినతిపత్రం అందజేశారు.

## కంచర్లలో కేంద్ర బృందం పర్యటన

వీర్నపల్లి, నవంబర్ 4 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల క్షేత్ర పరిశీలనలో భాగంగా కేంద్ర బృందం సభ్యులు మండలంలోని కంచర్లలో సోమవారం పర్యటించారు. ఉపాధి హామీ పనులు, ఎవెన్యూ ప్లాంటేషన్, కంపోస్టు షెడ్డు, వైకుంఠధామం పరిశీలించారు. ఉపాధి హామీ జాబ్‌కార్డులు, కూలీల సంఖ్య, కల్పించిన పనిదినాలు, చెల్లించిన డబ్బుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘ సభ్యులతో మాట్లాడారు. సభ్యులు ఎస్పీ సునీల్‌కుమార్, స్నేహా, ఏపీడీ నర్సింలు, ఐకేపీ డీపీఎం సుధారాణి, ఎంపీడీవో రఘురాం, ఏపీఎం నర్సయ్య, ఏపీవో శ్రీహరి, టీఏలు అనిత, గంగధర్, కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

## పింఛన్ ఇప్పించాలి

**కలెక్టరేట్‌కు తరలివచ్చిన ముస్తాబాద్ పక్షవాత బాధితులు**

కలెక్టరేట్, నవంబర్ 4 : ముస్తాబాద్ మండలానికి చెందిన పలువురు పక్షవాత బాధితులు పెన్షన్, ట్రైసైకిళ్లు ఇప్పించాలంటూ మూకుమ్మడిగా కలెక్టరేట్‌కు వచ్చి, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను వేడుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న తమకు పక్షవాతం వచ్చి నాలుగు, ఐదు సంవత్సరాలవుతుందని ఇప్పటి వరకు పెన్షన్ మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆయన సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగులు పల్నాటి రాములు, మెంగని శ్రీనివాస్, పొనగంటి బాల నర్సయ్య, కుంబాల సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

## సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

కలెక్టరేట్, నవంబర్ 4: ప్రజావాణిలో వచ్చే సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని అదనపు రెవెన్యూ కలెక్టర్ భీమ్యా నాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును నిర్ణీత సమయానికి పరిష్కరించాలని ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 122 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ శాఖకు 56, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు 18, ఉపాధి కల్పన శాఖకు 11, సిరిసిల్ల మున్సిపల్ 7, డీఆర్డీవో, సెస్, సర్వే, ఎంపీడీవో కొనరావుపేటకు మూడు చొప్పున, విద్యా శాఖ, ఎంపీడీవో తంగళ్లపల్లి, గంభీరావుపేట, వేములవాడకు రెండు చొప్పున, కార్మిక శాఖ, జిల్లా సంక్షేమ అధికారి, ఆర్టీసీ సిరిసిల్ల, జిల్లా వైద్యాధికారి, లీడ్ బ్యాంక్ మేనేజర్, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి, ఎంపీడీవో ఇల్లంతకుంట, వేములవాడ రూరల్, ఎల్లారెడ్డి పేటకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్ చేయడం నేరం

**ఎస్పీ అఖిల్ మహాజన్**

తెలంగాణ చౌక్, నవంబర్ 4 : విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మహిళల రక్షణ, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటివాటిపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరై, మాట్లాడారు. విద్యార్థులు తోటి వారితో అసభ్యంగా ప్రవర్తించడం ఇబ్బందులు పెట్టొద్దని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, యాజమన్యం, విద్యార్థులు ఉన్నారు.

**బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలి**

గంభీరావుపేట, నవంబర్ 4 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా పోలీసులు కృషి చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణ, రికార్డులు, వర్టికల్స్ అమలు తీరుతో పాటు పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సీడీ ఫైల్స్‌ను తనిఖీ చేశారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ శివకుమార్ ఉన్నారు.

**కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం మొద్దు నిద్ర**

వేములవాడ, నవంబర్ 4: వరి ధాన్యం కోతలు మొదలైనప్పటికీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రను వీడడం లేదని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు, కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు అన్నారు. సోమవారం వేములవాడ తహసీల్దార్ కార్యాలయంలో వారు వినతి పత్రం అందజేసి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుల పిన్నింటి హన్మాండ్లు, గుడిసె మనోజ్, రేగుల రాజ్‌కుమార్, నామాల శేఖర్, బిల్లా కృష్ణ, రేగుల శ్రీకాంత్, లక్ష్మిరాజం, పృథ్వి రాజ్, సగ్గు రాహుల్, కోరపు వెంకటేశ్, రంజిత్ రెడ్డి, నగేశ్ తదితరులు ఉన్నారు.

**ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి**

చందుర్తి,నవంబర్4 : రైతులు పండించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వెంటనే చేపట్టాలని మండల రైతు సంఘం అధ్యక్షుడు పెంటయ్య అన్నారు. సోమవారం మండల రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కు వినతిపత్రం అందించారు. బీఆర్ఎస్ మాజీ ఏఎంసీ చైర్మన్లు అశోక్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న పవర్‌లూం వర్కర్స్ యూనియన్ నాయకులు

## వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేయాలి

- సిరిసిల్ల నేతన్నలు
- చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట ధర్నా

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : వర్కర్‌టూ ఓనర్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని సిరిసిల్ల నేతన్నలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేనేత జౌళీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడుతూ, అప్పారెల్ పార్కులో నిర్మించిన వర్కర్ టూ ఓనర్ పథకానికి సంబంధించిన షెడ్లను ఇతరులకు కేటాయించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రూ. కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన షెడ్లలో ధాన్యం నిల్వ చేయాలని అధికారులు తీసుకున్న నిర్ణయం సరైంది కాదని సూచించారు. దాదాపు వెయ్యి మంది కార్మికులను యజమానులుగా చేయాలన్న లక్ష్యంతో గత కేసీఆర్ ప్రభుత్వం షెడ్లను నిర్మించిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ పథకాన్ని వెంటనే ప్రారంభించి నేతన్నలకు ఉపాధి చూపాలని కోరారు. పది శాతం యార్న్ సబ్సిడీ పైసలు కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, వార్పిన్ వర్కర్స్‌యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, నక్క దేవదాస్, ఉడుత రవి, బింగి సంపత్, బెజ్గం సురేశ్, మోర తిరుపతి, గుండు రమేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

రజితకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): హమాలీ కార్మికులను శ్రమ దోపిడికీ గురిచేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యల తీసుకోవాలని ఏఐటీయూసీ హమాలీ కార్మిక సంఘం డిమాండ్ చేశారు. పౌర సరఫరాల శాఖ అధికారిని రజితకు ఆ సంఘం నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆజ్జ వేణు మాట్లాడుతూ ఐకేపీ సొసైటీల్లో లారీలోడ్ చేసి తాడు కడితే తాడుమాముల పేరుతో టన్నుకు రూ. 40 ప్రభుత్వమే చెల్లించేదని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం కాంట్రాక్టర్లకు ఇస్తున్నప్పటికీ, వారు హమాలీలకు చెల్లించడం లేదన్నారు. పైసలు హమాలీలకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బచ్చుపల్లి శంకర్, సోమ నాగరాజు, రాయమల్లు, దేవేందర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్